క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

ఏన్కూరు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపిక య్యారు. ఈ నెల 27న కల్లూరులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జావెలింగ్‌త్రో సీనియర్స్ విభాగంలో శరత్, జూనియర్స్ విభాగంలో నరేష్, విజయ్ ప్రతిభ కనబర్చి ఆగస్టు 7న జనగాంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, పీఈటీ వీర, ఉపాధ్యాయులు అభినందించారు.

పాసింజర్ రైలు సదుపాయం కల్పించాలి


రామచందర్‌రావుకు సింగరేణి టోపి, పార అందజేస్తున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి పాసింజర్ రైలు సదుపాయం కల్పించాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు కోరారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు రామచందర్‌రావు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సింగరేణి సాంప్రదాయ పద్ధతిలో కార్మికుడి పార, టోపితో సత్కరించి సమస్యలపై వినతిపత్రం అందించారు. నాయకులు ఈవి.రమేష్, నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, మధుసూదన్‌రావు, విజయ్, శివకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లాడలో స్వాగతం..

తల్లాడ: కొత్తగూడెంకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు మండలకేంద్రంలో మంగళవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు చల్లా నాగులు శాలువాతో సన్మానించారు. రింగ్ సెంటర్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహం నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వర్‌రావు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర్‌రావు, తాండ్ర వినోద్‌రావు, ఈవీ రమేష్, రమేష్, పెరికె కిరణ్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనువాసరావు, నరేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



సత్తుపల్లిరూరల్: పట్టణంలోని వేంసూరురోడ్ మెట్టాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగపంచమి పంచమి సందర్భంగా నాగదేవతలకు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా వెలగపూడి రామారావు, కమల, పైళ్ల ధనలక్ష్మి, మువ్వా శ్రీనివాసరావు, మధురవాణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కాలిలేని కాంతారావు, మల్లూరు అంకమరాజు, ఎం.వెంకటరమణ, జె.వెంకటేశ్వరరావు, చెన్నయ్య పాల్గొన్నారు.

స్ట్రెంచ్ కొట్టించిన అధికారులు

కారేపల్లి: మండలపరిధిలోని మాణిక్యారం, ఎర్రబోడు అటవీప్రాంతంలో వివాదాస్పద పోడు ప్లాంటేషన్ చుట్టూ ఫారెస్టు అధికారులు జేసీబీల సాయంతో మంగళవారం స్ట్రెంచ్ కొట్టించారు. ఎఫ్‌డీఓ వెంకన్న ఆధ్వర్యంలో ఖమ్మం సబ్‌డివిజన్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని అధికారులు, సిబ్బంది భారీ బందోబస్తుల నడుమ ఇతరులు, పశువులు లోనికి వెళ్లకుండా ఎక్కువ లోతులో పోడు ప్లాంటేషన్ చుట్టు స్ట్రెంచ్ కొట్టారు. కాగా ఇటీవల మాణిక్యారం, ఎర్రబోడు ప్రాంతంలోని పోడు ప్లాంటేషన్ వివాదస్పదంగా మారిన సంగతి తెలిసిందే.

నాగులపంచమి వేడుకలు


నాగేంద్రుడికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో నాగపంచమి పండుగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మల్లికార్జునాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో కొలువు తీరిన నాగేంద్రుడికి పాలాభిషేకం చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఆదమరిస్తే గోతిలో పడ్డట్టే..

గుంతలమయంగా కారేపల్లి- ఇల్లెందు రోడ్డు

- ప్రాణాలుపోతున్నా పట్టించుకోట్లేదని వాహనదారుల ఆవేదన
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు..


అప్పాయిగూడెం గోదాం వద్ద గొయ్యిలో పోసిన మట్టి

కారేపల్లి: గుంతల్లో పడిపోతున్నాం.. ప్రాణాలు పోతున్నా మరమ్మతులు చేపట్టరా అని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమరపాటుగా ఉండి వాహనాలు నడిపితే, రోడ్డుపై గుంతుల్లో పడి ప్రాణాలుపోవడమా లేక దివ్యాంగులు కావటమా అన్నట్లుగా కారేపల్లి–ఇల్లెందు ప్రధాన రోడ్డు పరిస్థితి ఉంది. కారేపల్లి నుంచి ఇల్లెందు వరకు ఉన్న 10 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారిలో 20 నుంచి 30 చోట్ల రహదారిపై గోతులు పడ్డాయి. వాహనదారులకు దగ్గరకు వచ్చే వరకు ఈ గోతులు కన్పించకపోవడంతో వాహనాలు ఈ గోతుల్లో పడి అదుపుతప్పి పల్టీలు కొట్టి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికే పలువురు గుంతల్లో పడి గాయాలపాలు, ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి.

ప్రమాదకరంగా మారి..

కారేపల్లి నుంచి కారేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలోని కస్తూర్బా స్కూల్ ముందు, మద్దులవాగు లోలెవల్ కల్వర్టు, వెంకటసాయినగర్ సమీపంలోని కల్వర్టు, అప్పాయిగూడెం గోదాం, గాజులతండా మలుపు, భాగ్యనగర్‌తండా, విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు, ఆంజనేయస్వామి ఆలయం, ఆలియాతండా మలుపు, ఉసిరికాయపల్లి ఆర్చి, పోలంపల్లి ఎస్సీ కాలనీ, సోలార్‌ప్లాంట్ ప్రధాన ద్వారం, ఓసీ మలుపుల వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై అత్యంత ప్రమాదకర గోతులు పడ్డాయి. అప్పాయిగూడెం గోదాం వద్ద ఏర్పడిన గోయ్యి రెండు మూరల లోతులో ఏర్పడటంతో ఆటోడ్రైవర్లు కలిసి గట్టి మొరం వేసుకున్నారు. ఈ గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని, కొన్ని సందర్భాల్లో అదుపుతప్పి ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని, రోడ్డుకు మరమ్మతులు చేసి గోతులకు ప్యార్చ్‌వర్క్ చేయాలని విన్నవించుకున్న పట్టించుకునేవారేలేరని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా భాగ్యనగర్ సబ్‌స్టేషన్ సమీపంలో ఏర్పడిన గొయ్యిల వద్ద ఇప్పటికే మూడు ప్రమాదాలు జరిగాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఆలియాతండా వద్ద..

గుంతలతో ప్రమాదాలు..



గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరకు వచ్చే వరకు గుంతలు కన్పించటం లేదు. ఒక్కసారిగా వాహనాలు గుంతల్లో పడటంతో వాహనాలు దెబ్బతినటంతోపాటు, ప్రమాదాలు జరిగి గాయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదే రోడ్డుపై నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు రోజూ వెళ్తున్నా పట్టి పట్టనట్లు ఉంటున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలి.

– గుగులోత్ కృష్ణ, ఆటోడ్రైవర్, భాగ్యనగర్‌తండా

మేమే మట్టి పోసుకున్నాం..



రెండు మూరల లోతులో గుంతలు ఏర్పడ్డాయి. మేమే మొరం పోసుకున్నాం. వానకు ఆ మొరం కూడా కొట్టుకుపోయింది. వాహనాలు ఆ గుంతల్లో పడి అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేస్తే బాగుంటుంది. లేదంటే వాహనాలు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగకుండా అధికారులు చొరవ తీసుకోవాలి

– వి.కిషోర్, ఆటో డ్రైవర్, తులిస్యాతండా

సేవలతోనే నాయకత్వ లక్షణాలు


ప్రమాణస్వీకారం చేయిస్తున్న దృశ్యం

వైరా: సేవల ద్వారానే నాయకత్వ లక్షణాలు అలవడుతాయని వైరా లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంగళవారం వైరాలోని మిట్టపల్లి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్టాలేషన్ ఆఫీసర్ ఆమృతపల్లి కోటేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా వై.బుచ్చిరామారావు, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడిగా జాల పుల్లారావులతో పాటు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో యానాల మోహనరెడ్డి, చిలుకూరి రామకృష్ణ, సతీష్ కుమార్, లగడపాటి ప్రభాకర్, చింతోజు నాగేశ్వరరావు, బెల్లంకొండ ఆంజనేయులు, డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, మాదినేని సునీత, వనమా విశ్వేశ్వరరావు, నూకల ప్రసాద్, శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జ్, టీపీసీసీ చీఫ్‌తో భేటీ


మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్‌లతో రంగారావు

వైరా: ఏఐసీసీ తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లను టీపీసీసీ కార్యదర్శి వైరాకు చెందిన కట్ల రంగారావు మంగళవారం కలిశారు. రంగారావును టీపీసీసీ నల్లగొండ జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని జిల్లాలో పరిస్థితులు గురించి నాయకులకు వివరించారు.

సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

కల్లూరు: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈ నెల 31న ఇంటర్మీడియట్‌లో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.కనకదుర్గ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి మొదటిసారి పాసైన వారు అర్హులని, ఎస్ఎస్‌సీ మెమో, ఆదాయ, కుల, బర్త్ సర్టిఫికేట్లతో కళాశాలకు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని, మధ్యాహ్నం 1 వరకు దరఖాస్తులు స్వీకరణ, 2 నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

బోనకల్: ఈ నెల 31న మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ కళాశాలలో ఎంపీసీ విభాగంలో 9, బైపీసీలో 7 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.

కారేపల్లి: స్థానిక శ్రీ కవిత ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయంలో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల (ఇల్లెందు) ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కందాల లిల్లి తెలిపారు. ఎంపీసీ విభాగంలో 8 సీట్లు, బైపీసీ విభాగంలో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 31న కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

కమిటీ ఎన్నిక

కారేపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ సంస్థ మాధారం డోలమైట్‌మైన్స్ ఏఐటీయూసీ అధ్యక్షుడిగా కొల్లి శివాజీ, ప్రధాన కార్యదర్శిగా బి.వీరూ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం మైన్స్ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు గౌరవాధ్యక్షుడు కొల్లి వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.శివలాల్, ఉపాధ్యక్షుడిగా కేవీ.ప్రసాద్, కార్యదర్శిగా బి.చందు, కోశాధికారిగి సీహెచ్.గోపాల్, ఉపకోశాధికారిగా అబ్దుల్ అజీజ్ ఎన్నుకున్నారు. రాందాస్, మోహన్ ఉన్నారు.

అందుబాటులో యూరియా

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి, ముదిగొండ సహకార సొసైటీల పరిధిలోని దుకాణాల్లో రైతులకు అందుబాటులో యూరియా ఉందని మండల వ్యవసాయాధికారిణి సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాల్లో డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

'యయాతి'కి బహుమతులు

మధిర: తిరుపతిలో ఇటీవల అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యాన జాతీయస్థాయి పద్య నాటక పోటీలు నిర్వహించారు. ఇందులో మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ బాధ్యులు ప్రదర్శించిన యయాతి పద్య నాటకానికి తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించింది. అలాగే, పద్య పఠనానికి చిలువేరు శాంతయ్య, నటిగా లహరి బహుమతులు అందుకున్నారు. ఈ నాటకానికి శారదాప్రసన్న రచనా సహకారం అందించగా, డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు దర్శకత్వం వహించారు.

ధర్నాను జయప్రదం చేయాలి

మధిర: సమస్యల పరిష్కారానికి పోరాటంలో భాగంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 1 ఖమ్మంలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగూర్‌వలీ అన్నారు. ఈ మేరకు మధిర ఎస్సీ కాలనీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ రెండో రోజు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. నాయకులు మహ్మద్ రఫి, మల్లరాజు, బొబ్బిళ్లపాటి రమేష్‌బాబు, లంక నాగేశ్వరరావు, కృష్ణాంజనేయులు, గోపిచంద్ ఉన్నారు.

నానో ఎరువులతో శ్రమ తక్కువ


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ నర్సింహారావు

ఏన్కూరు: నానో ఎరువుల వాడకంతో శ్రమ తగ్గి సమయం ఆదా అవుతుందని వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని రేపల్లెవాడలో పత్తిపంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక బస్తా యూరియా బదులుగా పావు లీటరు నానో యూరియా, ఒక బస్తా డీఏపీ బదులుగా అరలీటరు నానోడీపీ సరిపోతుందన్నారు. అనంతరం నాచారంలో జరుగుతున్న బెంగాల్ నాట్లను పరిశీలించి వరిలో అవలంభించాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అశోక్, బాలకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మధిర: సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. మండలపరిధిలోని చిలుకూరు ఎస్సీ కాలనీలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి నీటి నిల్వలు తొలగించి, దోమల నివారణ మందును పిచికారీ చేశారు. రోగులను పరీక్షించి మందుల్ని పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది సుబ్బలక్ష్మీ, సరోజినిదేవి, లంకా కొండయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని పెద్దబీరవల్లి, మోటమర్రి గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి స్రవంతి సిబ్బందితో ఇంటింటా సర్వే నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. వైద్యసిబ్బంది శోభారాణి, సాయిలక్ష్మీ, సింధు, జయమ్మ, లలిత, తదితరులు పాల్గొన్నారు.


మధిర: నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

ముదిగొండ: మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. మండలంలోని చిరుమర్రి, మాధాపురంలలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి తెలిపారు. ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, పంచాయతీ కార్యదర్శి రాధకృష్ణ, సూపర్‌వైజర్లు లత, పద్మావతి, పీహెచ్ఎస్ రాణి, ఏఎన్ఎం కృష్ణవేణి, నీలావతి, అరుణకుమారి, రత్నకుమారి, వసంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


బోనకల్: వైద్యశిబిరం పరీక్షలు..


ముదిగొండ: ఇంటింటి సర్వే..

ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు..


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ

ఎర్రుపాలెం: డీలర్లు ఎరువుల విషయంలో కృత్రిమ కొరత సృష్టించొద్దని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మధిర ఏడీఏ ఎస్.విజయ్‌చంద్ర హెచ్చరించారు. మండలంలోని రాజుపాలెం, బనిగండ్లపాడు, అయ్యవారిగూడెం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఎరువుల డీలర్లు విధిగా స్టాక్స్ నిల్వలు, రిజిష్టర్, బిల్స్ బుక్స్, ఇన్వాయిస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణాల ఎదుట విధిగా స్టాకు వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు చేశారు. ప్రస్తుతం 160 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. అదేవిధంగా మండలంలోని టపాసుల దుకాణాలను కోళ్ల ఫారాలను తనిఖీలు చేసి టపాసుల తయారీలో, కోళ్ల దాణాలో యూరియా వినియోగించవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ బి.సాయిశివ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం


సమావేశంలో కమల్‌రాజ్, తదితరులు

చింతకాని: ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, ఆరుగ్యారంటీలను అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల్లో ఓట్లు అడగాలని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలపరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో చింతకాని, ముదిగొండ, బోనకల్ మండలాల బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంతోమంది త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ అహర్నిశలు కృషి చేశారని, బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు అందరికీ అందాయన్నారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య మాట్లాడుతూ.. అవసరమైతే టీడీపీలోకి చేరతాను తప్ప కాంగ్రెస్ పార్టీలోకి చేరే ప్రసక్తే లేదన్నారు. మండల అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, వాచేపల్లి లక్ష్మారెడ్డి, చేబ్రోలు మల్లికార్జున్, మండల ప్రధాన కార్యదర్శులు బొడ్డు వెంకట్రామయ్య, వెంకట్, నాయకులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

వితరణ


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వైరా: ఆర్యవైశ్య మహాసభ మండలాధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ అధ్యక్షతన కొణతాలపల్లి వెంకటసుబ్బారావు, కోటేశ్వరిల మనవడు రేయాన్ష్ జన్మదినం సందర్భంగా ఆర్యవైశ్య నిరుపేదలకు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. వైరాకు చెందిన రాయల నారాయణరావు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు డాక్టర్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ రాయల సతీష్ బాబు జన్మదినం సందర్భంగా ఆర్యవైశ్య నిరుపేద విద్యార్థులకు వారి కళాశాలలో బైపీసీలో ఉచితంగా సీటు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, కొప్పురావూరి వెంకటేశ్వరరావు, నూకల శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యంబాబు, నూకల ప్రసాదరావు, గజ్జెల కృష్ణమూర్తి, రాయల అన్నపూర్ణ, రాయల విజయలక్ష్మి, రాయల లలిత, నూకల అన్నపూర్ణ, గజ్జల మాణిక్యమ్మ ఉన్నారు.

ఆట వస్తువులు వితరణ..

ముదిగొండ: మండలంలోని రాఘవాపురంలో ప్రాథమిక పాఠశాలలో భవిత సెంటర్‌లో దివ్యాంగులకు మంగళవారం తహసీల్దార్ సునిత ఎల్జిబెత్ ఆట వస్తువులను అందజేశారు. ఆర్‌ఐలు కల్యాణి, ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోమియో మందులు పంపిణీ

సత్తుపల్లిరూరల్: శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన సత్తుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, సిద్దారం, గౌరిగూడెం పాఠశాలల్లో విద్యార్థులకు దగ్గు, జ్వరం, జలుబు రాకుండా ముందస్తు హోమియో మందులను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం ఆర్.శైలకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు..

చింతకాని: మండల పరిధిలోని బస్వాపురం గ్రామానికి చెందిన గుడాల అనూషకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి మంగళవారం పంపిణీ చేశారు. నాయకులు కుక్కల గోపి, సయ్యద్ షాజహాన్, కన్నెబోయిన పాండురంగారావు, మెండె నాగేశ్వరరావు, బొడ్డు రత్తయ్య, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మల్లు నందిని

చింతకాని: లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. మండల పరిధిలోని నాగులవంచ, సీతంపేట గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం చిన్నమండవ గ్రామంలో ఇటీవల మున్నేరు నీటిలో మునిగి మృతి చెందిన అన్నదమ్ములు కాశిమాల నాగగోపి, నందకిషోర్ కుటుంబసభ్యులను నందిని పరామర్శించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, హౌసింగ్ మండల ఏఈ సుప్రియ, నాయకులు దొబ్బల సౌజన్య, మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, మడుపల్లి భాస్కర్, గోపి, కొప్పుల గోవిందరావు, నాగార్జున్, వీరభద్రం, పూర్ణయ్య, బస్వయ్య, వెంకటేశ్వర్లు, కొండలరావు, పర్చగాని సతీష్ ఉన్నారు.

సన్మానం..

కొణిజర్ల: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితుడైన మోటపోతుల బాబూరావును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని మంగళవారం సత్కరించారు. ఖమ్మంలోని భట్టి క్యాంపు కార్యాలయంలో నందినిని బాబూరావు కలవగా ఆయన్ను శాలువాతో సత్కరించి అభినందించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రంగారెడ్డి ఉన్నారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో గతేడాది టెన్త్ చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన పాముల వరుణ్ సందేశ్‌ను అభినందిస్తూ రిటైర్డ్ హెచ్ఎం దండెం సత్యనారాయణరెడ్డి రూ. 10 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. హెచ్ఎం ఎస్.జ్యోతిశ్రీ,, ఉపాధ్యాయులు వేములపల్లి బాలకృష్ణ, వీరమాచినేని వత్సలాదేవి, పద్మజ, సోమలక్ష్మి, యాకోబు, తిరుమల, సుమలత, లక్ష్మి, శ్రీను ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థినులు

వైరారూరల్: మండలంలోని వల్లాపురం గ్రామంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మంగళవారం గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. విద్యార్థినులు సాధన, హారిక, గేయ మాధురి, స్వాతి, అనూష, రోహిత, ఆదర్శ రైతు తుమ్మల రాణాప్రతాప్ ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని మత్కేపల్లిలో ఇంటి నిర్మాణ విషయమై జరిగిన ఘర్షణలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన పిల్లి శిరీష ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంగళవారం ముగ్గు పోస్తుండగా పిల్లి రాంబాబు, ఆయన కుమారులు గోపి, సాయి స్థలం తమదంటూ శిరీష, ఆమె తిరుపయ్యను కిందపడేసి చంపుతామని బెదిరించారు. ఈమేరకు శిరీష ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు మళ్లించే దిశగా..

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణా పబ్లిక్ స్కూల్ పేరంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రంగారెడ్డి మాట్లాడుతూ... పాఠశాలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల వైపు మళ్లించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లు నర్సరీగా రూపొందడమే కాకుండా, ఆంగ్లమాధ్యమాన్ని కూడా నేర్పుతామన్నారు. ఈ కార్యక్రమంలో మధిర, ఎర్రుపాలెం మండలాల ఎంఈవోలు ప్రభాకర్, మురళీమోహన్ రావు తదితరులు ఉన్నారు.

నాగులవంచలో కేంద్ర బృందం

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామాన్ని కేంద్ర అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రం, గ్రామపంచాయతీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పారిశుద్ధ్య పనులపై ఆరా తీశారు. ఈ బృందంలో సాయివర్షిత్, జాక్రియా ఉండగా, డాక్టర్ వేణుమాధవ్ ఉన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

బోనకల్: మండలంలోని రావినూతల గ్రామంలోని ఎస్సీ కాలనీలో అదనపు విద్యుత్ స్తంభాలను అధికారులు మంగళవారం ఏర్పాటు చేశారు. స్తంభాల అవసరాన్ని కాంగ్రెస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేబ్రోలు వెంకటేశ్వరరావు డిప్యూటీ సీఎం భట్టి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వట్టికొండ రామకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లూరి రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బానోతు శ్రీను, జాని, నాని తదితరులు ఉన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలివ్వాలి

సత్తుపల్లిటౌన్: రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రావి వీరవెంకయ్య భవనంలో జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండు, చలమాల విఠల్, కృష్ణార్జున్‌రావు, సర్వేశ్వరరావు, ఎ.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎన్.ఉపేందర్ - 99591 24151 మధిర ఎస్.కె. సైదులు - 90524 34278
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

రవికుమార్ - 99499 27792
ఎన్ జయరాజు - 96528 68642